క్లుప్తంగా

డీఈఓను కలిసిన భోజన కార్మికులు



డీఈఓ సోమశేఖరశర్మను కలిసి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సత్తుపల్లిరూరల్: గతేడాది నుంచి రావాల్సిన కోడిగుడ్లు, అల్పాహారం, గ్యాస్ బిల్లులను, గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీఈఓ సోమశేఖర్ శర్మను కలిసి వినతిపత్రం అందించారు. గౌరవ వేతనం గత ఎనిమిది నెలలుగా బకాయి ఉన్నాయని తక్షణమే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, తెలగారపు రామారావు, సుందరమ్మ, రాఘవమ్మ, సుజాత, నాగలక్ష్మి, వెంకటమ్మ, కోటమ్మ, సక్కుబాయి, కృష్ణవేణి, వరలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మధిర: కలయిక వాకర్స్ క్లబ్ సభ్యుడు, వ్యాపారి చిత్రపు రమణ పుట్టినరోజు సందర్భంగా గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. తొలుత రమణను రంగా వెంకటేశ్వరరావు తదితరులు సన్మానించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇరుకుళ్ల బాలకోటేశ్వరరావుతో పాటు వేమూరి సునీల్, కాజా శ్రీనివాసరావు, నాగుబండి వంశీ, ఇరుకుళ్ల సురేష్, వంగూరి గోపి, మేడిశెట్టి కేశవరావు, మహంకాళి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తిలో రేపు మాక్ ఎంసెట్ పరీక్ష

సత్తుపల్లిరూరల్: గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 4న రాష్ట్ర స్థాయిలో మాక్ ఎంసెట్ పరీక్షను నిర్వహించబడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో గోపాలమిత్ర మృతి



బొర్రా రమేష్(ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల గ్రామానికి చెందిన బొర్రా రమేష్(48) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈయన మండలకేంద్రంలోని పశువైద్య శాలలో గోపాలమిత్రగా విధులు నిర్వర్తిస్తున్నాడు. పశువులకు, గొర్రెలు, మేకలకు వైద్యం చేయడంలో రమేష్ చురుకుగా పనిచేసే వారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గుండెపోటుతో రమేష్ మృతి చెందడంతో స్థానికులు, పలువురు రాజకీయ నాయకులు ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

స్వాతంత్య్ర సమరయోధుడు వెంకటయ్య మృతి



అంబటి వెంకటయ్య (ఫైల్)

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, టీడీపీ సీనియర్ నాయకుడు అంబటి వెంకటయ్య (93) అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని గురువారం మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, టీడీపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నున్నా తాజుద్దీన్, అంబటి వెంకటేశ్వర్లు, పెంట్యాల పుల్లయ్య, ఎంపీపీ పూర్ణయ్య, వైస్ ఎంపీపీ హనుమంతురావు, టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె..

తల్లాడ: మండలంలోని నారాయణపురం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని చూడి గేదె మృతి చెందింది. నారాయణపురం గ్రామానికి చెందిన వేమిరెడ్డి వెంకట్రామిరెడ్డికి చెందిన గేదెను మేత కోసం వదలగా అది గురువారం రాత్రి వరకు ఇంటికి రాలేదు. దీంతో రైతు గేదెను వెతకగా వైరా రోడ్డులో గేదె మృతి చెందింది. ఈమేరకు రైతు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

లీడర్ వద్దు.. క్యాడర్ ముద్దు

కారు దిగుతామన్నా.. హస్తం అందించే పరిస్థితి కనిపించటం లేదు.. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సర్వశక్తులు ఒడ్డి ప్రయత్నాలు సాగిస్తున్నా.. కాంగ్రెస్ పార్టీలో చేరికకు ఆమోదం లభించకపోవటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. లీడర్‌స్థాయి వ్యక్తులను దూరంగా ఉంచి.. కార్యకర్త స్థాయి క్యాడర్‌ను చేర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకత్వం మొగ్గు చూపుతూ పెద్ద ఎత్తున చేరికలను ప్రోత్సహిస్తూ వ్యూహాన్ని అమలు చేస్తుంది.

- కాంగ్రెస్‌లోకి వస్తామని ప్రదక్షిణలు
- వర్గాలుగా వీడిపోకూడదనే సంకేతం..
- ఎమ్మెల్యే నిర్ణయంపై కార్యకర్తల హర్షాతిరేకాలు



మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిన పెనుబల్లి ఎంపీపీ లక్కినేని అలేఖ్య భర్త వినీల్



కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్న డాక్టర్ మట్టా దయానంద్

సత్తుపల్లి: కొత్తవారిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకుంటే వర్గ విబేధాలతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని.. కష్ట కాలంలో పార్టీకోసం పనిచేసిన వారికి సరైన న్యాయం దక్కదని పార్టీలో చేరికలను సున్నితంగా తిరస్కరిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల పార్టీలో చేరేందుకు ఓ ముఖ్యనేత అన్ని ఏర్పాట్లు చేసుకున్నా ఆ గ్రామంలో కార్యకర్తలు విముఖత చూపటంతో చివరి నిమిషంలో చేరికలకు బ్రేక్ పడినట్లు సమాచారం. ఇటు బీఆర్ఎస్ పార్టీని వీడినా.. అటు కాంగ్రెస్‌లో చేరికలకు ముందుకు రాకపోవటంతో నేతల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ప్రచారం సాగుతోంది.

ఎంపీపీ నుంచి కౌన్సిలర్ వరకు..

సత్తుపల్లి నియోజకవర్గంలో బండ్లు ఓడలు.. ఓడలు బండ్లు అవటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ పార్టీలో ఓ వెలుగు వెలిగిన నేతలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వెంపర్లాడాల్సిన పరిస్థితి నెలకొంది. పెనుబల్లి మండల ఎంపీపీ లక్కినేని అలేఖ్య గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి కనబర్చినట్లు సమాచారం. ఈ క్రమంలో ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ లదే తుది నిర్ణయం అని తుమ్మల తెలపడంతో.. పెనుబల్లిలోని రంగారావుబంజరులో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో లక్కినేని వినీల్ చేరికను వ్యతిరేకించిన విషయాన్ని తుమ్మలకు వివరించినట్లు తెలిసింది. ఇకపోతే నియోజకవర్గంలో మరో ఇద్దరు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు తమకు ఉన్న పాత పరిచయాలను కలుపుకొని విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాలలో చర్చించుకుంటున్నారు.

ద్విముఖ వ్యూహంతో..

అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే రెట్టింపు మెజార్టీ సాధించేందుకు డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ దంపతులు ద్విముఖ వ్యూహంతో ముందుకెళ్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన పార్టీ క్యాడర్‌కు మరింత ప్రోత్సాహం అందిస్తూ.. గ్రామ, పట్టణ స్థాయిలో ఎన్నికల ప్రచారంలో తలోవైపుకు వెళ్లి అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని రక్తికటిస్తున్నారు. సత్తుపల్లికి ఎమ్మెల్యే ఒకరు కాదు.. ఇద్దరు అనుకునేలా క్యాడర్‌కు విశ్వాసం కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీకి దూరమైన వర్గాలను కలుపుకునే ప్రయత్నాలకు కార్యకర్తల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి.

పార్లమెంట్ ఎన్నికల్లో..

కాంగ్రెస్ పార్టీకి బలం లేనప్పుడే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తుపల్లి పట్టణ ప్రాంతంలో అప్పటి అధికార పార్టీ కంటే కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ ఓట్లు వచ్చాయి. ఈ సారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో మరింత మెజార్టీ వచ్చేందుకు వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో డాక్టర్ మట్టా రాగమయికి 1,11,245 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యకు 91,800 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్లలో కాంగ్రెస్ పార్టీకి 1,796 ఓట్లు వచ్చాయి. మట్టా రాగమయికి 91,440 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈ సారి కాంగ్రెస్ పార్టీ రెండింతల మెజార్టీని సాధించేందుకు కసరత్తు చేస్తుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సొంత నియోజకవర్గం కావటం, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో ఇక్కడి నుంచే ప్రాతినిధ్యం వహించటంతో ఇరువురి అండదండలతో మెజార్టీని పెంచుతామని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్ దంపతులు కార్యకర్తలకు దిశ నిర్దేశం చేస్తున్నారు.

ఇంటి వద్దే ఓటు..

నేటి నుంచి రెండు రోజుల పాటు ఓటింగ్

సత్తుపల్లిటౌన్: పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేక వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేయలేకపోతున్నారు. ఈనేపథ్యాన గత అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం హోం ఓటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. మంచి ఫలితాలు రావడంతో లోక్‌సభ ఎన్నికల్లోనూ అమలుకు సిద్ధమయ్యారు. సత్తుపల్లి నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 494 మంది దివ్యాంగులు, వృద్ధులు ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకోగా.. ఈ ఎన్నికల్లో 481 మంది మాత్రమే అర్హత పొందారు. 40శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులు, పూర్తిగా నడవలేని వయోవృద్ధులు వేలల్లో అర్హులు ఉన్నప్పటికీ దరఖాస్తు చేసుకోకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందని తెలుస్తోంది. కాగా, శుక్ర, శనివారాల్లో హోం ఓటింగ్ నిర్వహించేందుకు సిద్ధమైన అధికారులు ప్రత్యేక బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో సూక్ష్మ పరిశీలకుడు, సెక్టోరల్, పోలింగ్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, పోలీస్, వీడియో గ్రాఫర్లు ఉంటారు. ఈ బృందాలు దరఖాస్తు చేసుకున్న వృద్ధులు, దివ్యాంగుల ఇంటికివెళ్లి పోలింగ్ కేంద్రం మాదిరిగానే ఏర్పాట్లు చేసి ఓటింగ్ నిర్వహిస్తారు. కాగా, సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి మండలంలో దివ్యాంగులు, వృద్ధులు 151 మంది, తల్లాడ మండలంలో 75మంది, కల్లూరు మండలంలో 79మంది, పెనుబల్లి మండలంలో 95మంది, వేంసూరు మండలంలో 81మందికి 481మందితో రెండు రోజుల్లో ఇంటి వద్దే ఓటు వేయించేలా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



సత్తుపల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి, నాయకులు

సత్తుపల్లిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమౌతుందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. పట్టణంలోని వెంగళరావునగర్, జలగంనగర్‌లలో గురువారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో రఘురామిరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలు మట్టా దయానంద్ సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో చల్లగుళ్ల నర్సింహారావు, ఎండి కమల్‌పాషా, గాదె చెన్నారావు, తోట సుజలరాణి, ఎస్‌కె నాగుల్‌మీరా, కంటే నాగలక్ష్మి, ఎండి గఫార్‌ఖాన్, ఎం.పద్మజ్యోతి, రామారావు, గోపాలరావు, కరీముల్లా, షాదిజ పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

మధిర: ఈ నెల 4న మధిరలో నిర్వహించే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు ప్రచార ర్యాలీని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కోరారు. గురువారం మధిరలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామ విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యకర్తలు నామ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్





విద్యార్థినులు జయశ్రీ, సుప్రజలను సత్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్



వైరా: విద్యార్థినులను అభినందిస్తున్న డీఈఓ సోమశేఖర శర్మ

మధిర/వైరా/కారేపల్లి: మధిర మండలంలోని మర్లపాడు ఉన్నత పాఠశాల విద్యార్థిని వడ్డెరపు జయశ్రీ , కారేపల్లిలోని మోడల్ స్కూల్ విద్యార్థిని జూపల్లి సుప్రజ, వైరాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎస్సెస్సీలో 10జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఖమ్మంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను గురువారం కలిశారు. ఈ మేరకు కలెక్టర్, డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు విద్యార్థులను సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమాలల్లో సీఎంఓ రాజశేఖర్, డీసీఈబీ సెక్రటరీ నారాయణ, హెచ్‌ఎం పి.భీమరాజు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వెంకట్, జానీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ.అక్తర్ రుజమాన్, క్లాస్ టీచర్ జానకీరాములు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.రమ తదితరులు పాల్గొన్నారు.

బాలికను సత్కరించిన పోలీసులు..



వసంత శాంతిని సత్కరిస్తున్న ఎస్సై శంకరరావు

కొణిజర్ల: కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న వసంత పుల్లయ్య, రజని దంపతులు కూతురు వసంత శాంతి వైరాలోని తెలంగాణ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో చదివి ఎస్సెస్సీలో 10 జీపీఏ సాధించింది. ఈ సందర్భంగా గురువారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జె.శంకరరావు బాలికను శాలువా, జ్ఞాపికతో సత్కరించి అభినందించారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం..



ఇంటర్‌లో ప్రతిభ చూపిన బాలికను సత్కరిస్తున్న మేరు సంఘం అధ్యక్ష , ఉపాధ్యక్షులు

కొణిజర్ల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన మేరు కులానికి చెందిన విద్యార్థులు పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించినందుకు గురువారం కొణిజర్లలో మేరు సంఘం మండల అధ్యక్షురాలు బొడ్లు శిల్పిక, ఉపాధ్యక్షుడు వాడపల్లి కనకలింగేశ్వరరావుల ఆధ్వర్యంలో శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం, తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో సాయినాధుడికి గురువారం ఆయా దేవాలయాల అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బాబాకి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. కర్పూర హారతి ఇచ్చారు. భక్తులు సాయిబాబాని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిక



సీపీఐలో చేరిన భాస్కర్‌తో కూనంనేని సాంబశివరావు, నాయకులు

చింతకాని: మండల పరిధిలోని కొదుమూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు అనుబోతు భాస్కర్ ఖమ్మంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో గురువారం సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా సమితి సభ్యులు కూచిపూడి రవి, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు, నాయకులు నక్కనబోయిన కృష్ణ, చల్లగుండ్ల వెంకటేశ్వర్లు, నీరుడు గోవిందరావు, బొర్రా వెంకటేశ్వరరావు, చిట్టిమోదు కొండలరావు, అనుబోతు వీరబాబు, జనగాం వెంకటేశ్వర్లు, బల్లి హుస్సేన్, శీలం ఉపేందర్, చల్లగుండ్ల సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇస్రోలో ప్రాజెక్ట్ చేసిన విద్యార్థిని



బ్యూలాని అభినందిస్తున్న విజయ కళాశాల యాజమాన్యం

కొణిజర్ల: తనికెళ్ల సమీపంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ సీఎస్ఈ తృతీయ సంవత్సరం చదువుతున్న పి.బ్యూలా.. ఇస్రోలో ప్రాజెక్ట్ పూర్తి చేసింది. జేఎన్‌టీయూ హైదరాబాద్, ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్న్‌షిప్‌లో.. జేఎన్‌టీయూ హైదరాబాద్ పరిధిలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలల నుంచి ఇద్దరిని ఎంపిక చేసింది. వారిలో బ్యూలా ఒకరు. ఎన్ఆర్ఎస్‌సీలో హై రిజల్యూషన్ ఇమేజ్ డేటా క్వాలిటీ ఎనాలసిస్ అనే అంశంపై శాస్త్రవేత్త కె.నాగలక్ష్మి పర్యవేక్షణలో ప్రాజెక్ట్ పూర్తి చేసింది. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్ చైర్మన్ పి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జాన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, సీఎస్‌సీ హెచ్‌ఓడీ సంధ్యారాణి విద్యార్థిని అభినందించారు.

ఎస్సెస్సీలో అన్నదమ్ముల ఉత్తీర్ణత

కల్లూరు: ప్రతిభకు అంగవైకల్యం అడ్డురాదని నిరూపించారు కల్లూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన సోదరులు. పాస్టర్‌గా పనిచేస్తున్న అంబేడ్కర్ నగర్‌కు చెందిన పెరుమాళ్ల దయాకర్, సుకన్య దంపతుల ఇద్దరు కుమారులు జయసూర్య, భానుతేజ చిన్ననాటి నుంచే పుట్టు మూగ, చెవుడు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో వారిలో కష్టపడి చదువుకోవాలనే తపన వారిని పదో తరగతి ఉత్తీర్ణులు అయ్యేలా చేసింది. ఇద్దరు సోదరులు కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదవి పది పరీక్షలు రాయగా.. జయసూర్యకు 7.3 జీపీఏ రాగా.. భానుతేజకు 7 జీపీఏ గ్రేడ్‌లు సాధించారు. సోదరులిద్దరూ సైగల ద్వారా మాత్రమే అర్థం చేసుకుంటారు. ఈ మేరకు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సొసైటీ కమిటీ ఎన్నిక

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని బేతనీయం చర్చిలో గురువారం పాస్టర్స్ ఫెలోషిప్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఫెలోషిప్ మండల కమిటీ అధ్యక్షుడిగా స్థానిక చర్చి ఫాదర్ ఆదా ఎలీషా ఎన్నిక చేశారు. ప్రధాన కార్యదర్శిగా పులి హరోను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని చర్చి ఫాదర్ల సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

చెలరేగిపోతున్న మట్టి మాఫియా



బోడియాతండా సమీపంలో తవ్విన కరకట్ట



తనికెళ్ల సమీపంలో కరకట్ట మట్టిని పూర్తిగా తవ్విన దృశ్యం

కొణిజర్ల: మండలంలో ఎన్నెస్పీ కాల్వ కరకట్ట మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా.. అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తనికెళ్ల, బోడియా తండా, తుమ్మలపల్లి తదితర ప్రాంతాలకు చెందిన పలువురు.. పగలు, రాత్ర తేడా లేకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టి తోలకాలు చేపడుతున్నారు. మట్టి తోలకాలు పూర్తి కాగానే.. పక్కన రైతులు తమ పొలాల్లో కలుపుకుంటున్నారు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా.. కనీసం కన్నెత్తి చూడటం లేదు. ఇంత జరుగుతున్నా.. రెవెన్యూ, ఎన్నెస్పీ అధికారులు పట్టించుకోవడం లేదని తనికెళ్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అండదండలతో..

పోలీసులకు ఫిర్యాదు చేస్తే రాత్రి వేళ సంఘటనా స్థలానికి వెళ్లి ట్రాక్టర్లను పట్టుకుని కనీసం వాటిని స్టేషన్‌కు కూడా తరలించకుండా తిప్పి పంపించినట్లు సమాచారం. మట్టి తోలకాలు చేపడుతున్న వారికి ఉన్నతస్థాయి రాజకీయ నాయకుల సహకారం ఉందని అందుకే అధికారులు అటువైపు కూడా తిరిగిచూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మట్టి తోలకాలు చేపట్టాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి తోలకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకుని ఎన్నెస్పీ కరకట్టలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ఈత.. కడుపుకోత

- వేసవి సరదాలు.. విద్యార్థులకు గండాలు
- అవగాహన లేక ప్రాణాలు కోల్పోతున్న వైనం
- తల్లిదండ్రుల జాగ్రత్తలు తప్పనిసరి



సాగర్ కాల్వలో ఈత కొడుతున్న యువకులు

వేసవికాలం.. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందాలన్నా.. స్నేహితులతో సరదాగా గడపాలన్నా ఈత ఒకటే మార్గం. ఈ నేపథ్యంలో ఎంతో మంది విద్యార్థులు, పెద్దవారు సైతం బావులు, కాల్వలు, చెరువుల్లో సేద తీరుతూ కనిపిస్తుంటారు. అయితే కొంత మంది ఈత రాకపోయినా.. ఎలా కొట్టాలో తెలియకపోయినా ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

వైరా: వేసవి సెలవుల్లో పిల్లలు.. పెద్దలు ఈత నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతారు. మండు వేసవిలో ఎండవేడిమి నుంచి ఉపశమనానికి.. సెలవుల సరదాతో కాలక్షేపం కోసం ఈతకు వెళ్లడం అందరికీ అభిరుచిగా మారుతోంది. అలాంటిది ఈత రాక ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. కనీసం అవసరమైన స్విమ్మింగ్ పూల్స్ లేక పోవడంతో ప్రమాదాలకు కారణమవుతుంది. భౌగోళికంగా చూస్తే ఉమ్మడి జిల్లాలో వాగులు, వంకలు, నదులు, బావులు, కాల్వలకు కొదువలేదు.

– జిల్లా కేంద్రంతో పాటు ఇతరపట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఈత సరదాను తీర్చుకునేందుకు బావులకు వెళ్తుంటారు. పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువకులు ఆయా ప్రాంతాల్లో ఉంటే బావులు, కుంటలు, చెరువులు, కాల్వలను అధికంగా ఆశ్రయిస్తున్నారు. చాలా మందికి ఈత కొట్టడం ఎలాగో తెలియక ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. రక్షణ చర్యల్లేక ఈత మాటున నిండు ప్రాణాలను పోట్టుకుని కన్న వారికి కడుపుకోత మిగులుస్తున్నారు.

రక్షించడం ఇలా..

ప్రత్యక్ష పద్ధతి ద్వారా నీటిలో మునిగిపోతున్న వ్యక్తిని రక్షించే వీలుంటుంది. అయితే రక్షించబోయే వ్యక్తికి ఈత రావడంతోపాటు ధైర్యం కలిగి ఉండాలి. నీటిలో మునుగుతున్న వ్యక్తి వెనుక నుంచి వెళ్లి అతని వెంట్రుకలు, అండర్‌వేర్, మొలతాడు వంటి వాటిలో ఏదో ఒకటి పట్టుకొని ఒడ్డుకు తీసుకురావాలి.

పరోక్ష పద్ధతి..

ఈ పద్ధతి ద్వారా ఈత వచ్చిన వారితో పాటు రాని వారు కూడా నీటిలో మునుగుతున్న వారిని రక్షించవచ్చు. రక్షించే వారు నీటిలోకి దిగకుండా ఒడ్డున ఉంటే ప్రమాదంలో చిక్కుకున్న వారికి ఆసరాగా ఒడ్డు నుంచే దేన్నైనా పట్టుకునేలా అందించాలి. దగ్గరగా ఉంటే కర్ర, టవల్, ప్యాంట్ వంటివి అందించాలి. దూరంగా ఉంటే తాడు, పొడవాటి కర్రను అందించి ఒడ్డుకు చేర్చాలి.



డై కొడుతున్న యువకులు

ప్రథమ చికిత్స ముఖ్యం..

నీటిలో ప్రమాదానికి గురైన వ్యక్తిని ఒడ్డుకు చేర్చగానే అతన్ని వెల్లకిలా పడుకోబెట్టాలి. అవసరమైతే నోట్లో నోరు పెట్టి శ్వాసను ఊదుతూ కృత్రిమ శ్వాస అందించాలి. చాతిపై చేతులతో ఒత్తాలి. దీంతో శ్వాస పెరుగుతుంది. ప్రథమ చికిత్స చేస్తూనే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించాలి.

జాగ్రత్తలు అవసరం..

- ఈత కొలనులోకి నేర్చుకునేందుకు వెళ్తున్నప్పుడు అక్కడ సుశిక్షితులైన కోచ్‌లు, ఇతర సిబ్బంది రక్షణ చర్యలు ఉన్నాయో లేదో పెద్దలు పరిశీలించిన తర్వాతే పిల్లలను పంపించాలి.
- చెరువులు, కాల్వల్లో, ఈతకు వెళ్తున్నప్పుడు బాలల వెంట పెద్దవారు తప్పక వెళ్లాలి.
- విహార యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు స్నానం ఆచరించాలే తప్పా అక్కడి వాటిల్లోకి వెళ్లి ఈత కొట్టడం చేయవద్దు.
- మట్టిని లోతుగా తవ్విన ప్రాంతాల్లో నిలిచిన నీటిలో లోతు తెలియదు. కాబట్టి ఇలాంటి వాటిలో ఈతకు సాహసం చేయరాదు.
- గ్రామీణ ప్రాంతాల్లో సెలవులు గడపడానికి వచ్చిన పిల్లలు వెళ్లినప్పుడు వారి వెంట పెద్ద వారు తప్పక ఉండాలి.